Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 111
సంచిక : 232
పేజీలు : 3
మంగళవారం, మే 05, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

## మొక్కజొన్న కేంద్రాలను సందర్శించిన ఎంపీ రఘునందన్



3లో...

# కన్నీరు మున్నీరవుతున్న అన్నదాత

## తడిసిన ధాన్యం.. చెదిరిన ఆశలు



**టీ మీడియా, మే 4, ముదిగొండ :**ఆరుగాలం శ్రమించి, రక్తాన్ని చెమటగా మార్చి పండించిన పంట.. చేతికొచ్చే తరుణంలో ప్రకతి పగబట్టింది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణం, విరుచుకుపడ్డ ఈదురుగాలులు, భారీ వర్షం జిల్లాలోని రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. అకాల వర్షం సృష్టించిన బీభత్సంతో అన్నదాతల కళ్లల్లో కన్నీరు సుడులు తిరుగుతోంది.

**తడిసిన ధాన్యం.. చెదిరిన ఆశలు**

జిల్లాలోని రోడ్ల వెంట, కళ్లాల్లో, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న కుప్పలు వర్షపు నీటిలో నానుతున్నాయి. వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రాణాలకు తెగించి పోరాడారు. గాలిదుమారానికి పట్టాలు ఎగిరిపోతుంటే, వాటిని పట్టుకోలేక, కురుస్తున్న వర్షంలో తడుస్తూ తన పంట కొట్టుకుపోతుంటే చూస్తూ నిస్సహాయ స్థితిలో రైతులు రోదించిన తీరు పలువురిని కలచివేసింది.

**బాణాపురంలో దయనీయ స్థితి..**

ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మొక్కజొన్నలు అమ్మి కాంటాలు (తూకం) వేసి నెల రోజులు గడుస్తున్నా, వాటిని లారీలకు ఎక్కించి గోదాములకు తరలించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. 'కాంటాలు వేసిన బస్తాలు నెల రోజులుగా అక్కడే మూలుగుతున్నాయి. లారీలు రావు.. అధికారులు పట్టించుకోరు. ఇప్పుడు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ఈ నష్టానికి బాధ్యులెవరు? అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పాలకుల నిర్లక్ష్యంపై నిప్పులు**

వందల క్వింటాళ్ల పంట రోడ్లపైన, కళ్లాల్లో తడిసిపోతున్నా



పాలకులు, అధికారులు కనీసం వచ్చి చూడటం లేదని రైతులు మండిపడుతున్నారు. తూకం వేసిన బస్తాలను తరలించకపోవడమే శాపమైందని, ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు అడుగుతారని, లేదా అసలు కొనమని చెబుతారని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకపోతే, అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర మత్తు వదిలి స్పందించాలి. తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి. వెంటనే లారీలను పంపి నిల్వ ఉన్న బస్తాలను తరలించాలి అని బాణాపురం రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు. అన్నం పెట్టే అన్నదాత కంట నీరు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మరి పాలకులు కదులుతారా? రైతన్న కన్నీరు తుడుస్తారా? అన్నది వేచి చూడాలి.

# యూరియా అధిక వినియోగం తగ్గించాలి

**-- శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

**టీ మీడియా,మే4, చుంచుపల్లి:** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చుంచుపల్లి మండలంలోని ప్రశాంత్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రైతు వేదిక వద్ద నిర్వహించిన రైతు వారోత్సవ కార్యక్రమాల తొలి రోజు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. రైతులు అధిక మోతాదులో యూరియా వినియోగం చేయడం వల్ల భూసారం దెబ్బతిని భూమి ఉత్పాదకత తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల యూరియా వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని స్పష్టం చేశారు.భూమి ఆరోగ్యాన్ని కాపాడేందుకు పంట మార్పిడి పద్ధతులను తప్పనిసరిగా అనుసరించాలని, ఒకే పంటను వరుసగా సాగు చేయడం వల్ల భూసారం క్షీణిస్తుందని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సాంకేతిక సూచనలు రైతులు అనుసరించాలని సూచించారు .కార్యక్రమంలో ప్రధానంగా భూమి ఆరోగ్య సంరక్షణ మరియు భూసార పరీక్షల ప్రాముఖ్యతపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించిన రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందజేసి, వాటి వినియోగం, ప్రయోజనాలను వివరించారు. పంటల వారీగా ఎరువులను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు.పంటలకు అవసరమైన పోషకాలు (మ్యాక్రో, మైక్రో న్యూట్రియెంట్స్) గురించి రైతులకు అవగాహన కల్పించారు. సహజ వ్యవసాయం విధానాలు, వాటి ప్రయోజనాలపై వివరాలు అందించారు. రాబోయే వానాకాలం సీజన్‌కు అనుగుణంగా సన్న రకాల వరి వంగడాలు మరియు వాటి సాగు పద్ధతులపై కూడా రైతులకు మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా "రైతు ముంగిటకు శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, శాస్త్రవేత్తలు గ్రామ స్థాయిలో రైతులకు నేరుగా చేరుకుని ఎరువుల యాజమాన్యం, యూరియా వినియోగం తగ్గింపు, భూసార పరీక్షల ప్రాముఖ్యత, పంట మార్పిడి విధానాలు మరియు లాభదాయక పంటల సాగుపై అవగాహన కల్పించారు.జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ, జిల్లాలోని 67 రైతు వేదికల్లో మే 4వ తేదీ నుండి మే 9వ తేదీ వరకు రైతు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహం మరియు వానాకాలం పంటల ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని వివరించారు.ఈ రైతు వారోత్సవాల ద్వారా రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ , డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, స్థానిక సర్పంచ్, జెడి హార్టికల్చర్, జిల్లా హార్టికల్చర్ అధికారి కిషోర్ , కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మరియు శాస్త్రవేత్తలు, కొత్తగూడెం ఏడిఏ, చుంచుపల్లి మండల వ్యవసాయ అధికారి, ఏఈఓలు, అనుబంధ శాఖల అధికారులు, సాయిల్ శాంపిల్స్ వాలంటీర్లు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## స్త్రీనిధి వసూళ్లలో నత్తనడక

### సమైక్య నిధులు సున్నా..

### కాగితాలకే పరిమితం అవుతున్న

### ప్రత్యేక బృందాల పనితీరూ..

**టీ మీడియా,మే04, సింగరేణి (కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో స్త్రీనిధి, మండల సమైక్య నిధుల వసూళ్ల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.ఇటీవల అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పర్యటిస్తూ వసూళ్లపై దృష్టి పెట్టాలని ఆదేశించినప్పటికీ, ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. గడువు విధించిన తర్వాత నుంచి ఇప్పటి వరకు కొంతమంది సభ్యులు మాత్రమే స్త్రీనిధి బకాయిలు చెల్లించినట్టు సమాచారం. మిగిలిన వారిలో వసూళ్లు నిలిచిపోవడంతో లక్ష్యాలు చేరడం కష్టంగా మారింది.అధికారులు తరచూ సమీక్షలు నిర్వహిస్తూ, బకాయిల వసూళ్లపై వేగం పెంచాలని సూచిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు లోపిస్తోంది. ఇక మండల సమైక్య నిధుల విషయంలో పరిస్థితి మరింత దయనీయంగా

మిగతా 3లో

# మొక్కజొన్న కేంద్రాలను సందర్శించిన ఎంపీ రఘునందన్

**నిబంధనలపై ఆగ్రహం.**

**టీ మీడియా మే 4 కొణిజర్ల :**రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్ మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో నిండిపోయిన మొక్కజొన్న వరి, రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి ఆయన మాట్లాడారు.

**ఎకరానికి 26 క్వింటాళ్ల నిబంధన ఎత్తివేయాలి**

మొక్కజొన్న కొనుగోలు విషయంలో ప్రభుత్వం పెట్టిన ఎకరానికి 26 క్వింటాళ్ల నిబంధనపై రఘునందన్ రావు తీవ్రంగా మండిపడ్డారు. "రైతు కష్టపడి ఎకరానికి 35 నుండి 40 క్వింటాళ్ల దిగుబడి తీస్తే, కేవలం 26 క్వింటాళ్లే కొంటామనడం ఏంటని?" ఆయన ప్రశ్నించారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని, ఈ నిబంధనను వెంటనే ఎత్తేసి పండిన ప్రతి గింజాను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

**కమిషన్ల దందాపై కఠిన చర్యలు తీసుకోవాలి**

కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో బస్తాకు ?50 చొప్పున కమిషన్ వసూలు చేస్తున్నారన్న రైతుల ఫిర్యాదుపై ఆయన స్పందిస్తూ, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లారీల లోడింగ్ విషయంలో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బంది పెట్టకూడదని, వెంటనే రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు.

**పియర్ 126 రకం వడ్లను కొనుగోలు చేయాల్సిందే**

వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యాన్ని ఆయన ఎండగట్టారు. "రైతులు సాగు చేసేటప్పుడు ఎలాంటి సూచనలు చేయని ప్రభుత్వం, ఇప్పుడు పంట చేతికి వచ్చాక పియర్ 126 రకం వడ్లను కొనబోమని చెప్పడం దుర్మార్గం" అని అన్నారు. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వెంటనే ఈ రకం వడ్లను కూడా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



**ప్రభుత్వానికి హెచ్చరిక:**

రైతులకు జరుగుతున్న అన్యాయంపై తాము పోరాటం ఆపబోమని, అధికారులు స్పందించి తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రఘునందన్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బికేస్ నాయకులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



## నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఐ

**టీ మీడియా,మే4, కూసుమంచి:** ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కూసుమంచి మండల కార్యదర్శి భూక్యా నరసింహ, జిల్లా సమితి సభ్యులు గుండెపొంగు మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని, గైగోళ్ళపల్లి, లాల్ సింగ్ తండా, సంధ్యా తండా గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రతినిధుల బృందం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి కోతలు మొదలుపెట్టి సుమారు 45 రోజులు అయినప్పటికీ ఉమ్మడి గ్రామపంచాయతీలో ఐకెపి వరి ధాన్య కొనుగోలు కేంద్రంని ఏర్పాటు చేయకపోవడం వలన ఈ పరిస్థితి నెలకొంది అని ఆరోపించారు. ఐకెపి సెంటర్లో ధాన్యాన్ని ఆరబెట్టిన ప్రతి రైతుకు సిబ్బంది పట్టాలు అందజేయలేదని దానివల్లనే ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తరుగులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల అధ్యక్షులు భూక్య ప్రసాద్ మాట్లాడుతూ.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం ముందస్తు చర్యలు వచ్చే పట్టకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాండురంగాచారి, భూక్య శ్రీకాంత్, జిల్లా నాగయ్య, జిల్లా వీరయ్య, మామిడాల వెంకన్న, స్థానిక రైతులు సైదులు, పరకాల రవి, లాల్ సింగ్ ధరవాత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి కందాల పరామర్శ

**టీ మీడియా ,మే 4, కూసుమంచి:**కూసుమంచి మండలం గోరీలపాడు తండా కి చెందిన భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యకర్త బానోతు సుధీర్ తండ్రి బానోతు జానకిరామ్ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పాలేరు మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుడు జానకిరామ్ చిత్రపటానికి పూలమాలవేసి కందాల నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి ఓదార్చారు. మీ కుటుంబానికి అన్ని విధాల ఎప్పుడూ అండగా ఉంటానని కార్యకర్త సుధీర్ నాయక్ , కుటుంబ సభ్యులకు కందాల ఉపేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన వెంట కూసుమంచి మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు వేముల వీరయ్య జిల్లా పార్టీ నాయకులు మళ్లీడి వెంకటేశ్వరరావు, కూసుమంచి మండల బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు వడిత్య బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కిషన్, మాజీ ఎంపీటీసీ జర్పుల బాలాజీ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షులు తేజావత్ శ్రీను నాయక్, నాయకులు జీవన్ నాయక్ చోటి నాయక్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి వసూళ్లలో నత్తనడక

ఉంది.ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదని తెలిసింది.దీనిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరికలు జారీ చేసినా, ఫలితం కనిపించకపోవడం గమనార్హం.మరోవైపు స్త్రీనిధి వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, బాధ్యులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.పారదర్శకత కోసం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం మార్పు కనిపించడం లేదని సభ్యులు అంటున్నారు. ప్రత్యేక బృందాల పర్యటనలు, అధికారుల సమీక్షలు కాగితం పైనే పరిమితం కాకుండా, వాస్తవంగా వసూళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని, అవకతవకలపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## ఎన్డీఏ విజయం పట్ల హర్షం

**టీ.మీడియా.మే4.చింతూరు:**బెంగాల్ లో బి జె పి ఎన్నికల్లో గెలవడం శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కల అని,దేశంలో యన్ డి ఎ విజయం పట్ల గిరిజన మోర్చా నాయకులు పాయం. వెంకయ్య, చింతూరు మండల మాజీ అధ్యక్షులు డివిఎస్ఎస్ రమణారెడ్డి( చిట్టిబాబు )ఒక ప్రకటనలో హర్షం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోమ్ శాఖ మంత్రి అమిద్ షా నాయకత్వంలో ఈ ఎన్నికల ఫలితాలు విభజన వాదులకు మంచి గుణపాఠం నేర్పిందన్నారు. దక్షిణాదికి అన్యాయం అంటూ గగ్గోలు పెట్టిన అక్కడ నాయకులకి మంచి గుణపాఠం ప్రజలు ఓట్లు రూపంలో తెలియజేశారన్నారు .కార్యకర్తల పోరాటం వల్లే బెంగాల్లో బిజెపికి అధికారం అలాగే తెలంగాణలో కూడా అతి త్వరలో బిజెపి రావడం తథ్యం మోడీ నాయకత్వంపై విశ్వాసానికి ఈ ఫలితాలే నిదర్శనం దేశ ప్రజలు ఎన్డీఏ కు మద్దతు తెలుపుతున్నారన్నారు. అనేదానికి ఇది ప్రత్యక్ష నిదర్శనమని,ఈ ఫలితాలు చారిత్రాత్మక ప్రజా తీర్పు భారత్ కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు.సబ్ కా సాద్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్ ఇది ఎన్డీఏ స్ఫూర్తి,ఈ ఫలితాలు వికసిత భారత్ కు మరింత బలోపేతం చేస్తాయన్నారు.ఎక్కడ ఎన్నిక జరిగిన బిజెపి దే గెలుపు నీతి నిజాయితీతో అవినీతి రహిత పాలన సాగుతున్నందునే దేశంలో ప్రజలు బిజెపిని ఆదరిస్తున్నారు. అని భారతీయ జనతా పార్టీ నాయకులు పాయం వెంకయ్య, చింతూరు మండల మాజీ అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి( చిట్టిబాబు )తో పాటు కట్టం ముత్తయ్య, మడివి కన్నారావు, శ్యామల లక్ష్మణ్ రావు, జోగారావు, మడివి చందు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల నీటి సామర్థ్యం పెంపుపై అవగాహన

**టీ.మీడియా.మే4.దమ్మపేట**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చెరువుల నీటి సామర్థ్యం పెంపుదలకు సంబంధించిన కార్యాచరణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు చెరువుల్లోని సారవంతమైన మట్టిని రైతులు తమ పొలాలకు వాడుకోవడానికి ఉచితంగా ఇచ్చేందుకు, వాణిజ్య అవసరాల కోసం నిర్దేశి రుసుం చెల్లించి అనుమతులు పొంది మట్టి తోలుకునే అంశంపై రైతులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెంపొందించే కార్యాచరణకు సర్పంచ్‌లకు, సెక్రటరీల ద్వారా చెరువు కింద రైతులకు, గ్రామ ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన అనుమతులను ఉప కార్యనిర్వాహక ఇంజనీరు, నీటి పారుదల శాఖ మందలపల్లి వారి ద్వారా తీసుకోవాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ రవీంద్రరెడ్డి, నీటిపారుదల శాఖ ఎఇఇలు గోపాలరావు, కృష్ణ, మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

## వేసవికాలంలో అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య శాఖ అధికారి డా.తుకారామ్ రాథోడ్

**టీ.మీడియా.మే4. పాల్వంచ**

వేసవికాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్ మెడికల్ అధికారులకు ఆదేశించారు. ఐడిఓసి జిల్లా కార్యాలయం నందు జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష చేపట్టబడింది. వేసవికాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రతి ఆరోగ్య కేంద్రాలలో, ఆరోగ్య కార్యకర్త, ఆశల వద్ద గ్రామపంచాయతీలలో, అంగన్వాడీ కేంద్రాలలో, చలివేంద్రాలలో జనాలు రద్దీగా ఉన్న ప్రాంతాలలో కచ్చితంగా ఏర్పాటు చేయవలెనని వడదెబ్బకు సంబంధించిన వివరాలను కూడా ఎప్పటికప్పుడు నివేదికను జిల్లాకు సమర్పించవలసినదిగా సూచించారు. గర్భిణీల నమోదు జిల్లాలో 100% చేయాలని, వ్యాధి నిరోధక టీకాలను కూడా 100% లక్ష్యాన్ని సాధించాలని అదేవిధంగా అసంక్రమిత వ్యాధులు అయిన బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్ గుర్తింపు కోసం గ్రామాలలో స్క్రీనింగ్ కచ్చితంగా 100% పూర్తి చేయాలని వాటి నివేదికను ఎప్పటికప్పుడు జిల్లాకు సమర్పించాలన్నారు. మలేరియా కేసులు పెరగకుండా ఇప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, ఫ్రైడే ఫ్రైడే పాటించాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు.

టీబీ కేసులను గ్రామాలలో గుర్తించి వారికి తెమడ పరీక్షలు చేయించి, వారికి చికిత్సను అందజేయాలని సూచించారు. ఇప్పటివరకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో 98% లక్ష్యాన్ని సాధించినట్లు తెలియజేయగా, మిగిలిన 2% లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేసి 100% సాధించవలసిందిగా వైద్యాధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ భద్రాచలం, డాక్టర్ సాయి కళ్యాణ్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ కొత్తగూడెం, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా.ప్రసాద్, డా. ప్రతాప్, డా.హరీష్, డా. రాకేష్, డా. రాందాస్, డా. దినేష్ తదితర వైద్యాధికారులు, ఎన్‌హెచ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.